ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది : 17-11-2026 **సమయం : 6.45 గంటలు**

ముఖ్యాంశాలు

1. రానున్న పదేళ్లలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మారనుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు.

2. దేశంలో ఔషధాల ధరలను నియంత్రించేందుకు ప్రత్యేక జాతీయ విధానాన్ని రూపొందించాలని రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

3. బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ శాఖల కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య శాఖ ప్రథమ స్థానంలో నిలిచింది.

4. హైదరాబాద్‌లో 27వ అఖిల భారత పోలీస్ బ్యాండ్ పోటీలను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు.

==========

రానున్న పదేళ్లలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మారుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. విజయవాడలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో నిన్న రాత్రి నిర్వహించిన రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్-2026 ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, కె.రామ్మోహన్ నాయుడు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులకు అవార్డులను ప్రదానం చేశారు.

అనంతరం అమిత్ షా మాట్లాడుతూ... విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన గూగుల్ డేటా సెంటర్ రాష్ట్రానికే కాకుండా దేశానికి కూడా గర్వకారణమని పేర్కొన్నారు.

వాయిస్ ..25.. సెకన్లు

అంతకుముందు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ... సమాజ అభ్యున్నతికి, దేశ ప్రగతికి విశేషంగా కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలను అవార్డుల ద్వారా గౌరవించడం అభినందనీయమని అన్నారు. సమాజానికి సేవ చేయడంలోనే నిజమైన విజయం ఆధారపడి ఉంటుందని అన్నారు. క్రమశిక్షణ, సంకల్పం, దేశసేవ వంటి ఆదర్శాలు తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని, భవిష్యత్తు తరాలకు నిరంతరం స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.

దేశంలో ఔషధాల ధరలను నియంత్రించేందుకు ప్రత్యేక జాతీయ విధానాన్ని రూపొందించాలని రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్ కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి నిన్న లేఖ రాశారు. క్యాన్సర్ మందుల విక్రయ ధరలను తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను స్వాగతించిన రమేశ్.. గుండె, కిడ్నీ, మధుమేహ వ్యాధులకు సంబంధించిన మందుల ధరలను కూడా సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అత్యవసర, ప్రాణాధార ఔషధాలపై విక్రయ మార్జిన్లకు పరిమితులు విధించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో జనఔషధి కేంద్రాలను మరింత విస్తరించడంతో పాటు.. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని రాష్ట్రాల ఆరోగ్య బీమా పథకాలతో అనుసంధానించాలని లేఖలో పేర్కొన్నారు.

భారతీయ భాషల్లో శాస్త్రీయ వ్యవసాయ పరిజ్ఞానాన్ని విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయంలో జాతీయ కార్యశాల నిన్న ప్రారంభమైంది. విశ్వవిద్యాలయంలోని కన్నడ భాష, అనువాద అధ్యయన విభాగం, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన భారతీయ భాషా సమితి సంయుక్తంగా ఈ నెల 20వ తేదీ వరకు ఈ కార్యశాలను నిర్వహిస్తున్నాయి. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఢిల్లీలోని కేంద్ర హిందీ సంచాలక కార్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ హితేంద్ర కుమార్ మిశ్రా ఉపన్యశించారు. ఆంగ్లం, హిందీ, తెలుగు, కన్నడ,తమిళం, మలయాళ భాషల్లో వ్యవసాయ శాస్త్రానికి సంబంధించిన సాంకేతిక పదాలకు సమానార్థక పదాలను రూపొందించడం, వాటికి ప్రామాణికత కల్పించడం ఈ కార్యశాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా నిర్వహించిన వివిధ శాఖల కార్యక్రమాల్లో వైద్యారోగ్య శాఖ ప్రథమ స్థానంలో నిలిచిందని మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించి, ప్రజలను పెద్దఎత్తున భాగస్వాములను చేసిన వైద్యారోగ్య శాఖ అధికారులను మంత్రి అభినందించారు. భారత్ అధ్యక్షతన ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా నిర్వహించిన ఈ వారోత్సవాల్లో 21 ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో మొత్తం 96 వేల 891 కార్యక్రమాలు నిర్వహించగా, ఇందులో వైద్యారోగ్య శాఖ ఒక్కటే 50 వేల 80 కార్యక్రమాలు నిర్వహించిందని తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ ఆదా, నీటి పొదుపు, సుస్థిర ఆహారం, వ్యర్థాల తగ్గింపు, ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

పోలీస్ బ్యాండ్ అనేది కేవలం సంగీత ప్రదర్శన మాత్రమే కాదని... పోలీసు బలగాల, క్రమశిక్షణ, ఆత్మగౌరవానికి ప్రతీక అని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. హైదరాబాద్ జవహర్‌నగర్‌లో నిర్వహించిన 27వ అఖిల భారత పోలీస్ బ్యాండ్ పోటీలను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల పోలీస్ బ్యాండ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం డీజీపీ మాట్లాడుతూ... ఈ ఏడాది పోటీల్లో సీఆర్పీఎఫ్, హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన రెండు మహిళా బృందాలు పాల్గొనడం గర్వకారణమన్నారు. అనంతరం కేంద్ర సాయుధ పోలీసు దళం – సీఆర్పీఎఫ్ సదరన్ సెక్టార్ ఐజీ టి. విక్రమ్ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర బలగాలకు చెందిన 25 పోలీస్ బ్యాండ్ బృందాల నుంచి సుమారు

1,400 మంది పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ పోటీల ద్వారా విభిన్న సంస్కృతులు, భాషలకు చెందిన పోలీసు విభాగాలు ఒకే వేదికపైకి వచ్చాయని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ నగరంలో జనగణన రెండవ దశ నిర్వహణకు సంబంధించి క్షేత్రస్థాయి సిబ్బందికి నిన్న శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ప్రారంభించారు.ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ.. జనగణన ప్రక్రియ విజయవంతంగా నిర్వహించడంలో క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి శిక్షణ ఎంతో కీలకమని అన్నారు. జనగణనకు సంబంధించిన మార్గదర్శకాలు, విధివిధానాలు, సమాచార సేకరణ పద్ధతులపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జనగణన ప్రక్రియను పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు.

తెలంగాణలో గవర్నర్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ – 2026కు దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ విడుదలైంది. ఈసారి నాలుగు విభాగాల్లో అవార్డులు అందజేయనున్నట్లు లోక్‌భవన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్ తెలిపారు. గత రెండేళ్లుగా ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మాదకద్రవ్యాల నిర్మూలన, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం, విద్య, ఉపాధి, పర్యావరణ పరిరక్షణ, భూమి, నీటి సంరక్షణ, భూగర్భ జలాలు, చెరువుల పరిరక్షణ, మొక్కల పెంపకం వంటి రంగాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు ఈ అవార్డులు అందజేయనున్నారు. వ్యక్తులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చని దాన కిశోర్ తెలిపారు. డిసెంబర్ 10వ తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

పశ్చిమమధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన తుపాను ఈరోజు సాయంత్రానికి తీవ్ర తుపానుగా, గురువారం ఉదయానికి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ తుపాను శుక్రవారం మధ్యాహ్నానికి నెల్లూరు–తుని మధ్య తీరం దాటే అవకాశం ఉందని తెలిపింది. తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర జిల్లాల్లో రేపటి నుండి అక్కడక్కడ భారీ వర్షాలు, కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం సంచాలకురాలు కె.నాగరత్న తెలియజేస్తూ...

వాయిస్ ..25.. సెకన్లు

ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా శ్రీశైలం దేవస్థానంలో గత రాత్రి కార్తీకమాస లక్షదీపోత్సవం నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో పుష్కరిణి వద్ద ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి, శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారి ఉత్సవమూర్తులకు దీపోత్సవ సంకల్పాన్ని పఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు, పుష్కరిణికి శాస్త్రోక్తంగా దశ హారతులు సమర్పించారు. ఈ అపురూప ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పుష్కరిణి పరిసరాలు కిటకిటలాడాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలను వెలిగించారు.

==========